క్లుప్తంగా

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

కాటారం: భూ భారతి చట్టం 2025 అమలులో భాగంగా ఈ నెల 3 నుంచి 20 వరకు భూ సమస్యల పరిష్కారం కోసం మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. 3న బయ్యారం, ఆదివారంపేట, 4న బొప్పారం, దామెరకుంట, 5న చిద్నెపల్లి, ధన్వాడ, 6న చింతకాని, ధర్మాసాగర్, 9న దేవరాంపల్లి, గూడూర్, 10న గారెపల్లి, గుమ్మాళ్లపల్లి, 11న కంబలపాడు, గుండ్రాత్‌పల్లి, 12న కాటారం, జాదారావుపేట, 13న కొత్తపల్లి, మల్లారం, 16న మేడిపల్లి, ఒడిపిలవంచ, 17న నస్తూర్‌పల్లి, రఘుపల్లి, 18న నల్లగుంట, పోతుల్వాయి, రేగులగూడెం, 19న మోరెపల్లి, ప్రతాపగిరి, వీరాపూర్, 20న సుందరాజ్‌పేట, విలాసాగర్‌లో సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సుల ద్వారా భూ సంబంధిత సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. భూ యజమానులు, రైతులు తమ భూమి రికార్డుల్లో తప్పులు ఉన్నా, రికార్డుల్లో పేర్లు నమోదు కాకపోయిన, ఇతర ఎలాంటి భూ సమస్యలు ఉన్న రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవచ్చునని తహసీల్దార్ వివరించారు. రైతులు, భూ యజమానులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు



ఏటూరునాగారం: మండలంలోని రొయ్యూర్ 163 జాతీయ రహదారిపై కారు, ద్విచక్రవాహనం ఆదివారం ఢీకొన్నాయి. దీంతో పలువురికి గాయాలు కావడంతో వరంగల్‌కు తరలించారు. కాగా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పీఏసీఎస్ నైట్ వాచ్‌మెన్ మృతి



లక్ష్మయ్య (ఫైల్)

కాళేశ్వరం: మహదేవ్‌పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో నైట్ వాచ్ మెన్‌గా విధులు నిర్వహించే తుంగల లస్మయ్య (55) ఆదివారం గుండె పోటుతో మృతి చెందారు. ఆయన మృతిపై పీఏసీఎస్ చైర్మన్ చ ల్ల తిరుపతి రెడ్డి ప్రగాఢ సంతాపం తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె..



మృతి చెందిన పాడిగేదె

రేగొండ: విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందిన సంఘటన మండలంలోని దమ్మన్నపేటలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మన్నపేట గ్రామానికి చెందిన మార్త నర్సయ్యకు చెందిన పాడి గేదె మేత మేసేందుకు పొలం వద్దకు వెళ్లింది. కాగా మేత మేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగకు తగిలి షాక్‌గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని అధికారుల నిర్లక్ష్యం వలనే ప్రమాదం సంభవించిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

ప్రమాదకరంగా రహదారి



బోరునర్సాపురం వద్ద తారులేచి పోవడంతో ప్రమాదకరంగా మారిన రోడ్డు



గంపోనిగూడెం వద్ద ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతలు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

మంగపేట: మండలంలోని బోరునర్సాపురం వద్ద ఏటూరునగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డు ప్రమాదకరంగా తయారైంది. రోడ్డుపై తారు లేచి నాలుగు నెలలు దాటుతున్నా సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు తమకేమీ సంబంధం లేదనే విధంగా వ్యవహరిస్తుండటంతో మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా జిల్లా సరహద్దులోని బ్రాహ్మణపల్లి నుంచి ఏటూరునాగారం ఎన్‌హెచ్ 163 వరకు గల 34 కిలోమీటర్ల రోడ్డుపై పలు చోట్ల బీటీ లేచిపోయి ప్రమాదకరంగా గుంతలు ఏర్పడింది. గత ఏడాది మండలంలోని తిమ్మంపేట క్రాస్ రోడ్డు నుంచి మంగపేట వరకు ప్రధాన రోడ్డుపై వేసిన బీటీ బోరునర్సాపురం వద్ద సంవత్సరం గడవక ముందే తారు లేచి పోయి ప్రమాదకరంగా మారింది. ఇదే విధంగా గడిచిన మూడేళ్ల కాలంలో కమలాపురం, చుంచుపల్లి, రాజుపేట, బ్రాహ్మణపల్లి వద్ద రోడ్డుపై వేసిన బీటీ లేచి పోయింది. అదే విధంగా చుంచుపల్లి, పాలాయిగూడెం గ్రామాల మధ్య, మల్లూరు బోరునర్సాపురం గ్రామాల మధ్య పలు చోట్ల, మండల కేంద్రంలోని గంపోనిగూడెం వద్ద ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. అయినప్పటికీ తమకేమీ సంబంధం లేదనే విధంగా ఆర్అండ్‌బీ అధికారులపై వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైన స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

యువత సమాజానికి ఆదర్శంగా నిలవాలి

- ఎస్సై నరేష్



వాలీబాల్, క్రికెట్ కిట్లను ఇస్తున్న ఎస్సై నరేష్

మంగపేట: యువత సత్ప్రవర్తనతో సామాజిక సేవా దృక్పదంతో ముందుకు సాగుతూ సమాజానికి ఆదర్శవంతంగా నిలవాలని ట్రైనీ ఎస్సై నరేష్ అన్నారు. మండల కేంద్రం పరిధిలోని పాదుమూరులో వాడబలిజ సంఘం జిల్లా అధికార ప్రతినిధి కళాల రాంబాబు, గుగ్గిళ్ల సురేష్ మాదిగ ఆధ్వర్యంలో యువతకు క్రీడా సామగ్రి పంపిణీ కార్యక్రమానికి ఎస్సై నరేష్ హాజరై యువ క్రీడాకారులకు క్రికెట్ బ్యాట్లు, వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. క్రీడల్లో రాణిస్తు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో కుల సంఘాల నాయకులు ఏట్ల అశోక్, గగ్గూరి మహేష్, ఎర్రావుల సమ్మయ్య, లక్ష్మణ్, మదనయ్య, తిప్పని శ్రావణ్, వెంకటేష్, రఘుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

‘జేడీ మల్లంపల్లి ప్రకటనపై కృతజ్ఞతలు’

ములుగు/ములుగు రూరల్: మల్లంపల్లి మండలానికి జేడీ మల్లంపల్లిగా ప్రకటించడపై మంత్రి డాక్టర్ సీతక్కకు పద్మశాలీ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్(పోపా)జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏళ్ల మధుసూదన్, చంచు రమేశ్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం వేర్వేరు ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మంత్రి సీతక్క మల్లంపల్లి మండలం కోసం పోరాట కార్యక్రమాల్లో పాల్గొన్నారని అన్నారు. అప్పటి జిల్లా పరిషత్ చైర్మన్ కుసుమ జగదీశ్ సైతం మండల ఏర్పాటుకు పోరాటం చేసినట్లు పేర్కొన్నారు. జగదీశ్ అకాలమరణంతో మల్లంపల్లి ప్రజల ఆకాంక్షమేరకు జేడీ మల్లంపల్లిగా ప్రకటిస్తామని మంత్రి మాట ఇచ్చి నిలబెట్టుకున్నారని అన్నారు. ఉద్యమకారుడికి కాంగ్రెస్ ప్రభుత్వం తగిన గుర్తింపు ఇచ్చిందని అన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎస్సై పరమేశ్

శాయంపేట : ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు మూడురోజుల పాటు మండల కేంద్రంలోని నవోదయ హైస్కూల్‌లో శ్రీరామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ వారి ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత యోగా, ధ్యాన శిక్షణలో ప్రజలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని ఆరోగ్యంగా ఉండాలని ఎస్సై జక్కుల పరమేశ్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉచిత యోగా శిక్షణ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. మానవుడు ఆరోగ్యంగా ఉండేందుకు ధ్యానం ఎంతో అవసరమని అన్నారు. మూడురోజుల పాటు నిర్వహించే ఉచిత యోగా శిక్షణ కార్యక్రమంలో యువకులు, విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరామచంద్ర మిషన్ సంస్థ కో ఆర్డినేటర్ శారద, జిల్లా కో ఆర్డినేటర్ అచ్చయ్య, రమేశ్, రాంబాబు, సత్యనారాయణ, సుధాకర్, సురేందర్ పాల్గొన్నారు.

సన్మానం



ఎస్సైని సన్మానిస్తున్న డాక్టర్లు

గోవిందరావుపేట: ఉత్తమ పోలీస్ అవార్డును పస్రా ఎస్సై కమలాకర్ ఇటీవల అందుకున్నాడు. దీంతో మండలంలోని ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్లు ఆదరణ గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఎస్సైని శాలువాతో సన్మానించారు. సంఘం అధ్యక్షుడు బొబ్బ మధుసుదన్‌రెడ్డి, యానాల వెంకట్‌రెడ్డి, బుర్రి శ్యాంబాబు, అనుప రాజేందర్, ఐలయ్య, వెంకటేశ్వరరావు, కర్ణాకర్, వెంకన్న, హజారొద్దీన్, నాగరాజు, సతీష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆపరేషన్ కగార్’ను నిలిపేయాలి

- సీపీఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ నాయకుడు విజయ్‌కుమార్



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

నర్సంపేట : ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన హత్యాకాండను నిలిపేయాలని సీపీఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ నాయకుడు గుర్రం విజయ్‌కుమార్, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు అరెల్లి కృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలోని సిటిజన్ క్లబ్ ఆవరణలో బుర్ర ఆనంద్, మొగిలి ప్రతాప్‌రెడ్డి, మండల యుగంధర్ అధ్యక్షతన ఆల్ ఇండియా కేత్ మజ్దూర్ కిసాన్ సభ, అఖిల భారత రైతు కూలీ సంఘం, రైతు కూలీ సంఘం (ఆర్‌సీఎస్) సదస్సు ఆదివారం నిర్వహించారు. తొలుత క్లబ్ నుంచి అంబేడ్కర్ సెంటర్ మీదుగా అమరవీరుల స్తూపం వరకు ఆపరేషన్ కగార్ వ్యతిరేక నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సదస్సులో విజయ్‌కుమార్, కృష్ణ మాట్లాడారు. ఆదివాసీలు, మావోయిస్టులపై దాడులపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని, కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, పెసా, అటవీ హక్కుల చట్టంలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారాన్ని అడ్డుపెట్టుకొని దేశాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకుడు చిన్న చంద్రన్న, ప్రముఖ కవి గొట్టిముక్కుల యోచన, టీటీఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి మహబూబ్ అలీ, జనగాం కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బడిలో చేర్పించడం అభినందనీయం

- ఎంఈఓ పాదెం మేనక



ప్రచార జాత కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ మేనక

మంగపేట: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించే బాధ్యత టీఎస్ యూటీఎఫ్ తీసుకోవడం అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి పాదెం మేనక అన్నారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచి ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు టీఎస్ యూటీఎఫ్ జిల్లా పక్షాన మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల నుంచి ప్రచార జాత కార్యక్రమాన్ని ఎంఈఓ మేనక ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషకరమన్నారు. అనంతరం టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గొప్ప సమ్మారావు మాట్లాడుతూ.. సమాజ హితం కోసం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం మంగపేట, కమలాపురం నుంచి ద్విచక్ర వాహనాలపై బోరునర్సాపురం, కొత్తపేట, తిమ్మంపేట, మల్లూరు, చుంచుపల్లి, వాడగూడెం, రమణక్కపేట, రాజుపేట వరకు ప్రచార జాత నిర్వహించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య, కోశాధికారి వెంకటస్వామి, కార్యదర్శి చెంచయ్య, మండల అధ్యక్షుడు గుండం పురుశోత్తం, నాయకులు శ్రీనివాస్, నరేష్, రమేష్, జోష్టనేశ్వర్, ప్రేమ్‌కుమార్, సారయ్య, వెంకటేశ్వర్లు, సతీష్, రమేష్, రామనాదం, వేణు, విజయ కుమారి, మంగవేణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి

- ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి



హెచ్చరిక స్టిక్కర్లు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

ఎస్ఎస్‌తాడ్వాయి: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రోడ్డు ప్రమదాల నివారణ చర్యల్లో భాగంగా ఆదివారం తాడ్వాయి నుంచి పస్రా, కాటాపూర్ క్రాస్ నుంచి గంగారం రోడ్డు మార్గన ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద చెట్లకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మలుపుల వద్ద వాహనదారులు నెమ్మదిగా వెళ్లాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రించేందుకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. మద్యం తాగి వాహనాలను నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతోపాటు కేసులు నమోదు చేస్తామన్నారు. డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు కూడా చేపడుతున్నామన్నారు. వాహనదారులు తప్పకుండా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. అలాగే కామారంలో రోడ్డు భద్రత, గంజాయి నివారణపై అవగాహన నిర్వహించారు. యువతకు వాలిబాల్ కిట్లు పంపిణీ చేశారు. ట్రైనీ ఎస్సై సతీష్, కానిస్టేబుల్ సాంబయ్య పాల్గొన్నారు.

రోడ్డుపై వెళ్లాలంటే తప్పని తిప్పలు



మురుగు ఉండడంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని శివాలయం వీధి ప్రజలకు రోడ్డుపై వెళ్లాలంటే తిప్పలు తప్పడం లేదు. రంగరాజాపురం పాఠశాల వెనుక భాగంలో ఉన్న రోడ్డుపైకి ఇళ్లలోని మురిగు నీరు వచ్చి కాల్వను తలపిస్తుంది. ఈ రోడ్డుపై నడిచేందకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై చేరిన మురికి నీటిలోంచి వెళ్లలేక రోడ్డుకు పక్కనే మట్టి కుప్ప పైకి ఎక్కి రోడ్డు దాటాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వారు పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గౌడ ప్రతిభా పురస్కారాల అందజేత



సిరిని సన్మానిస్తున్న గోపా నాయకులు

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన బుర్ర సిరి, కొత్తకొండ హర్షితలు గౌడ ప్రతిభా పురస్కార్ 2025 అవార్డు అందుకున్నారు. ఆదివారం గౌడ ఆఫిషియల్స్, ప్రొఫెషనల్(గోపా) హనుమకొండ, వరంగల్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో గౌడ హాస్టల్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన బుర్ర సిరి ఇంటర్ ఫలితాలలో 983/1000, అలాగే కొత్తకొండ హర్షిత పదో తరగతిలో 563/600 సాధించడంతో వారికి నగదు పారితోషికం, షీల్డ్, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోపా ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ వేణుగోపాల్ గౌడ్, వరంగల్ గోపా జిల్లా అధ్యక్షుడు బైరి లక్ష్మీనారాయణ , హనుమకొండ గోపా జిల్లా అధ్యక్షుడు చిర్ర రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



టేకుమట్ల: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో 1988–89 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. చిన్ననాటి మధురస్మృతులను నెమరవేసుకున్నారు. జీవితాల్లో జగిరిగిన కష్టా సుఖాలను పాలుపంచుకుని ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థులు రేగ నరేందర్, కోగిల సారయ్య, రేగ సూర్యారాయణ, కొమరం రామారావు, బుర్ర రవికుమార్, తల్లడి లక్ష్మయ్య, గంట కృష్ణారెడ్డి, రమేష్, వెంకటేశ్వర్లు, స్వరూప, చంద్రకళ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1999–2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. అనంతరం నాటి గురువులను మెమోంటో, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి ఉన్నత పాఠశాలలో 1993–94 సంవత్సరం పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అమ్మ గార్డెన్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.



ఎస్ఎస్ తాడ్వాయి: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



మొగుళ్లపల్లి: 1993-94 పదో తరగతి బ్యాచ్..

‘సాగు’దామా.. ఆగుదామా!

- ముందస్తు వానలతో గందరగోళం
- పలు చోట్ల విత్తనం వేసిన రైతులు
- తొందర పడొద్దంటున్న అధికారులు



పంట వ్యర్థాలను తొలగిస్తున్న కూలీలు

రేగొండ: ముందస్తు వానలు కురుస్తుండటంతో మండలంలోని రైతులు అయోమయానికి గురవుతున్నారు. సాధారణంగా వానకాలం మొదలైన తర్వాత జూన్ మొదటి వారం తర్వాత రైతులు విత్తనాలు వేస్తారు. అయితే ఈసారి వానకాలం రాకముందే వర్షాలు కురుస్తుండడం, అవి తొలకరి వానలని, అల్పపీడన ప్రభావంతో కూడా పడుతున్నాయని పలువురు అంటుండగా అన్నదాతలు గందరగోళంలో ఉన్నారు. రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లోని పలువురు రైతులు దుక్కులు దున్ని సిద్ధం చేసి ఉండడంతో ఇప్పటికే పత్తి విత్తనాలు వేశారు. ఇక విత్తనాలు వేయని రైతులు సందిగ్ధంలో ఉన్నారు. తొలకరి వానలు ఎత్తిపోతున్నాయని, చదును పనులు చేద్దామంటే వానల కారణంగా దుక్కులు సిద్ధం చేయలేని పరిస్థితి ఉందని ఆవేదన చెందుతున్నారు. ఈ పరిస్థితులలో సాగు చేద్దామా.. ఆగుదామా అన్న మీమాంసలో ఉన్న అన్నదాతలకు నేల పూర్తిగా తడిసిన తరువాతే సాగు ప్రారంభించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

అనుకూలమా.. ప్రతికూలమా

సాధారణంగా రోహిణి కార్తెలో రోళ్లు పగిలే ఎండలు ఉంటాయని సామెత ఉంది. కాని ఇంతకు ముందెన్నడు చూడని భిన్నమైన వాతావరణం ఈ సారి ఎదురవడంతో భవిష్యత్ ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురిసిన తీరా పంట చేతికందే సమయంలో వరుణుడు ముఖం చాటేస్తే తమ పరిస్థితి ఎలా ఉంటుందోనని రైతులు కలవరపాటుకు గురవుతున్నారు. కాగా ప్రస్తుతం రైతులు దుక్కులు సిద్ధం చేసుకోవడం చేలలో గత పంటల వ్యర్థాలను తొలగించే పనిలో బిజీగా ఉన్నారు.


తొందరపడొద్దు..



గతంలో ఎన్నడు లేని విధంగా నైరుతి రుతుపవనాలు ముందే వచ్చాయి. ఈ సమయంలో రైతులు దుక్కులు సిద్ధం చేసుకోవాలి. 60 నుంచి 80 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైన తర్వాత అదునులోనే విత్తనాలు వేసుకోవాలి. తొందరపడి విత్తనాలు వేస్తే చీడపీడల బారిన పడే అస్కారం ఉంటుంది.

– పెద్ది వాసుదేవరెడ్డి, ఏఓ, రేగొండ

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న మధుసూదనాచారి

మొగుళ్లపల్లి: మండలంలోని బంగ్లాపల్లికి చెందిన కరాబు యువరాజు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ఆదివారం శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి పరామర్శించారు. ఆయన వెంట చదువు అన్నారెడ్డి, దానవేణి రాములు, ధార్ల అనంద్, అరికాంతపు అన్నారెడ్డి, గుడిమల్ల రమేశ్ తదితరులు ఉన్నారు.